


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
18-12-2025
పేజీలు: 02



## భారత్-ఒమన్ మధ్య కీలక ఒప్పందాలు

భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండవ రోజు ఒమన్‌లో పర్యటిస్తూ ఉన్నారు. పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య పలు కీలక ఒప్పందాలు జరిగాయి. ద్వైపాక్షిక భాగస్వామ్యం, ప్రపంచం ముందు సవాళ్లపై చర్చించారు. ఒమన్‌లోని ప్రవాస భారతీయులతో మోదీ సమావేశం అయ్యారు. సమావేశంలో వారిని ఉద్దేశించి మాట్లాడారు. కాగా, ప్రధాని మోదీ నిన్న(బుధవారం) ఇథియోపియాలో పర్యటించారు. ఇథియోపియానుంచి ఒమన్ వెళ్లారు. ఉప ప్రధాన మంత్రి సయ్యిద్ షిహాబ్ బిన్ తారిఖ్ అలీ సైద్ మోదీకి ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ భేటీ అయ్యారు. w



## 10 నెలల్లో 8 యుద్ధాలు ఆపా

తాను ఎనిమిది యుద్ధాలు ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చాటింపు వేసుకున్నారు. ఇందుకు టారిఫ్‌లే కారణమని పేర్కొన్నారు. ఆంగ్లభాషలో 'టారిఫ్' అనే పదం తనకు చాలా ఇష్టమైన పదం అని ట్రంప్ పునరుద్ఘాటించారు.'పది నెలల్లో ఎనిమిది యుద్ధాలను ఆపాను. ఇరాన్ అణు ముప్పును నాశనం చేశాను. గాజాలో యుద్ధాన్ని ఆపి.. మూడు వేల సంవత్సరాల్లో పశ్చిమాసియాలో తొలిసారి శాంతిని నెలకొల్పా. ఎంతోమంది బందీలను విడుదల చేయించాను' అని ట్రంప్ తెలిపారు. అదేవిధంగా సుంకాల గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. అమెరికాలో 18 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించగలిగామని ఈ సందర్భంగా తెలిపారు. ఇదంతా సుంకాల కారణంగానే సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన ప్రతి సైనికుడికి ట్రంప్ 1,776 డాలర్ల నగదు బహుమతి ప్రకటించారు. 1.45 మిలియన్లకు పైగా సైనికులు క్రిస్మస్ కానుగా ఒక్కొక్కరు 1,776 డాలర్ల నగదు అందుకుంటారని తెలిపారు. ఇది వారి సేవ, త్యాగానికి గుర్తింపుగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సుంకాల కారణంగా ఎవరూ ఊహించనంత డబ్బు సంపాదించినట్లు చెప్పారు. ఇందుకు బిగ్ బ్యూటిఫుల్ బిల్లు సాయపడిందని ట్రంప్ వివరించారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హతపై

# స్పీకర్ సంచలన తీర్పు

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపుల కేసులో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ డిసెంబరు 17 (బుధవారం) తీర్పు వెలువరించారు. ఐదుగురు ఎమ్మెల్యేలపై పార్టీ ఫిరాయింపుల ఆరోపణలను స్పీకర్ తోసిపుచ్చారు. వారు పార్టీ ఫిరాయించినట్టు ఎక్కడా ఆధారాలు లేవని స్పష్టం చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటోన్న ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీ, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావులు ఫిరాయింపులకు పాల్పడలేదని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ వాదనలతో ఏకీభవించని స్పీకర్.. ఐదుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి నిరాకరించారు. పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్య విషయంలో నాలుగు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు గడువు విధించిన నేపథ్యంలో స్పీకర్ తీర్పు వెలువరించారు. 2023 తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి విజయం సాధించిన 10 మంది ఎమ్మెల్యేలు.. తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఈ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌ను కోరుతూ బీఆర్ఎస్ పిటిషన్లు దాఖలు చేశారు. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం. ఒక పార్టీ గుర్తుపై గెలిచి ఇంకో పార్టీలో చేరితే అనర్హులుగా ప్రకటించాలి. కానీ, అధికారికంగా మారడం లేదా విప్ ధిక్కరించాల్సి ఉంటుంది. ఈ ఐదుగురు ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదని మర్యాదపూర్వకంగా సీఎంను కలిశామని స్పీకర్ వద్ద వివరణ ఇచ్చారు. మిగతా ఐదుగురు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్ కుమార్‌ల అనర్హత



పిటిషన్లపై విచారణ జరిగింది. వీరిలో కడియం, దానం నాగేందర్‌లు తమ నిర్ణయం చెప్పడానికి స్పీకర్‌ను కొంత సమయం కోరారు. పోచారం, కాలే యాదయ్య, సంజయ్ కుమార్‌లపై పిటిషన్ల విచారణ పూర్తి కావడంతో త్వరలోనే స్పీకర్ నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. తాము స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా అనర్హతపై నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తున్నారని తొలుత బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేసింది. పదో షెడ్యూల్ ప్రకారం అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. ఆ తర్వాత బీఆర్ఎస్ నాయకులు సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం... 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని జులై 2025న ఆదేశించింది. అక్టోబర్ 31తో మూడు నెలల గడువు పూర్తికావడంతో 'గ్రాస్ కంటెంప్ట్' అంటూ సుప్రీంకోర్టు హెచ్చరించింది. నాలుగు వారాల్లో అంటే డిసెంబర్ 18లోపు నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు స్పష్టం చేసింది. ఈ క్రమంలో స్పీకర్ విచారణ ముగించి, ఐదుగురు ఎమ్మెల్యేలకు సంబంధించి తొలి దశలో తీర్పు ఇచ్చారు.



## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లో నేడు మరో ఎన్‌కౌంటర్ జరిగింది. సుక్మా జిల్లా గొల్లపల్లి అటవీ ప్రాంతం పరిధిలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్‌కు, మావోయిస్టులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. అయితే, మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. నేడు ఉదయం నుంచే ఆ ప్రాంతంలో అప్పుడప్పుడూ కాల్పులు శబ్దాలు వినిపించాయి. దీంతో, అధికారులు హైఅలర్ట్‌లో ఉన్నారు. ఇక తాజా ఎన్‌కౌంటర్ తరువాత పోలీసులు ఆ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఆ ప్రాంతంలో నక్సల్స్ ఏరివేత చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. అక్కడ నక్సల్స్ కదలికలు ఉన్నాయన్న సమాచారంతో తొలుత భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. ఇంతలో నక్సలైట్స్ కాల్పులకు దిగడంతో భద్రతా బలగాలు కూడా ఎదురుకాల్పులకు దిగారు. ఈ ఘటనలో కొందరు మావోయిస్టులు మరణించినా గాయపడ్డ వారు అడవిలోకి పారిపోయినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మరోవైపు, అదనపు భద్రతా దళాలు కూడా రంగంలోకి దిగాయి. ఆ ప్రాంతం మొత్తాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పోలీసులు పూర్తిస్థాయి ప్రకటన ఇంకా చేయాల్సి ఉంది. ఏరివేత చర్యలు మొత్తం పూర్తయ్యాక భద్రతా దళాలు.. మృతుల వివరాలు వెల్లడిస్తాయని సమాచారం. ప్రస్తుతం గొల్లపల్లి అటవీ ప్రాంతంలో పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నాయి. జిల్లా యంత్రాంగా పరిస్థితిని నిశితంగా గమనిస్తోంది.




## ఢిల్లీని కప్పేసిన పొగమంచు

కాలుష్య కాసారంగా మారిన ఢిల్లీలో దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఎదురుగా ఉన్నవారు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. దీంతో నగరంలోని చాలా ప్రాంతాల్లో ప్రజలు ఇండ్ల నుంచి కూడా బయటకు రాలేకపోతున్నారు. మంచు దుప్పటి కప్పేయడంతో రవాణా రంగంపై తీవ్ర ప్రభావం పడింది. ఇందిరాగాంధీ విమానాశ్రయంలో సుమారు 40 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. అదేవిధంగా 22కు పైగా రైళ్లు ఆలస్యమయ్యాయి. ఫ్లైట్ ఆపరేషన్స్ ప్రస్తుతం సీఏటీ 3 కండీషన్స్‌లో ఉన్నాయని, ఈ నేపథ్యంలో విమాన రాకపోకపోకలు ఆలస్యమవడం లేదా రద్దవడం వంటివి జరగవచ్చని విమానాశ్రయ వర్గాలు వెల్లడించాయి. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపారు. ప్రయాణికులు తాము వెళ్లాల్సిన విమానాల సమయాలను గురించి ఎప్పటికప్పుడు సంబంధిత ఎయిర్‌లైన్స్‌తో కాంటాక్ట్‌లో ఉండాలని సూచించారు. ఇక రాజధానిలో చాలా ప్రాంతాల్లో దృశ్యమానత తగ్గిపోవడంతో రహదారుల వెంబడి వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఢిల్లీని ఎన్‌సీఆర్ పరిధిలోని ప్రాంతాలతో కలిపి హైవేలపై కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. కాగా, కాలుష్యం నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రూప్ IV కింద అత్యంత కఠినమైన కాలుష్య నియంత్రణలు అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో ఒకటి నుంచి ఐదో తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. మిగిలినవారికి హైబ్రీడ్ మోడ్‌లో క్లాసుల జరుగనున్నాయి.



## గూగుల్ మ్యాప్స్ చూసుకుంటూ వెళ్లిన లారీ.. డ్రైవర్‌కు ఊహించని అనుభవం

ఓ పాతికేళ్ల క్రితం వరకు కూడా తెలియని ప్రాంతానికి వెళ్లాలనుకుంటే.. ఎవరిని అయినా దారి అడుగుకుంటూ వెళ్లేవాళ్లం. లేదంటే ఆ ఏరియా గురించి బాగా తెలిసిన వారిని తీసుకుని వెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. గూగుల్ మ్యాప్స్ ఓపెన్ చేశామా.. దాన్ని ఫాలో అవుతూ వెళ్తే సరి. అయితే మనిషి చెప్పినంత కచ్చితంగా ఈ గూగుల్ మ్యాప్ అడ్రస్ చెబుతుందా అంటే.. చాలా వరకు సందర్భాల్లో సరిగ్గానే గమ్యస్థానం చేరుస్తుంది. కానీ కొన్నిసార్లు మాత్రం చిత్ర విచిత్రమైన దారుల్లోకి తీసుకెళ్తుంది. తాజాగా తెలంగాణలో ఓ లారీ డ్రైవర్‌కు ఇదే పరిస్థితి ఎదురయ్యింది. నదిలోకి వెళ్లబోయిన వ్యక్తి ఆఖరి నిమిషంలో అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. గూగుల్ మ్యాప్ చూసుకుంటూ వెళ్లిన ఓ లారీ డ్రైవర్.. నదిలోకి దూసుకెళ్లాడు. కానీ ఆఖరి నిమిషంలో అప్రమత్తం కావడంతో.. ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ సంఘటన వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం జూరాల గ్రామంలో వెలుగు చూసింది. బాషా అనే లారీ డ్రైవర్.. ఆంధ్రప్రదేశ్‌లోని బేతంచర్ల నుంచి తెలంగాణ మక్తల్ పట్టణానికి బండల లోడుతో వస్తున్నాడు. బాషా అనే వ్యక్తి ఏపీలోని బేతంచర్ల నుంచి తెలంగాణలోని మక్తల్ పట్టణానికి తన లారీలో బండల లోడుతో వస్తున్నాడు. కొత్తకోట మండలం దగ్గరకు వచ్చాక.. జాతీయ రహదారి 44 మీదుగా ఆత్మకూరు నుంచి మక్తల్ వెళ్లేందుకు గూగుల్ మ్యాప్ ఆన్ చేసుకున్నాడు. తెల్లవారుజామున కావడంతో రోడ్ల మీద జనాలు కూడా పెద్దగా లేరు. దీంతో దారిని అడిగేందుకు ఎవరూ కనిపించకపోవడంతో.. గూగుల్ మ్యాప్ మీద ఆధారపడ్డాడు. మ్యాప్స్ ఆన్ చేసుకుని ప్రయాణం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో ఆత్మకూరు వద్ద కుడి వైపునకు తిరగాల్సి ఉండగా.. మ్యాప్ ప్రకారం ఎదురుగా వెళ్లాడు. అలా సుమారు మూడు కిలోమీటర్ల వరకు ప్రయాణం చేశాడు. గూగుల్ మ్యాప్ ప్రకారం వెళ్లిన లారీ కాస్త.. లోయర్ జూరాల నది వద్దకు చేరుకుంది. అప్పటి వరకు మ్యాప్ చూస్తూ ప్రయాణం చేస్తున్న లారీ డ్రైవర్.. ఎదురుగా నీరు కనిపించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. భయంతో వెంటనే లారీని ఆపేశాడు. దీంతో ఆఖరి నిమిషంలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. బండలను అన్‌లోడ్ చేసిన తర్వాత లారీని బయటకు తీశారు. ఈ సంఘటన గురించి తెలిసిన వారు మ్యాప్‌స్‌ను నమ్ముకుంటే మునగాల్సిందే అని కామెంట్ చేస్తున్నారు.



## నిధి అగర్వాల్‌కి చేదు అనుభవం

రాజాసాబ్ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా జరిగిన ఓ ఈవెంట్ లో నటి నిధి అగ ర్వాల్ కు చేదు అనుభవం ఎదురైంది. అభిమానులు ఆమెను చుట్టుముట్టి, తాకే ప్రయత్నం చేయడంతో తీవ్ర ఇబ్బందికి గురైంది. ఈ సంఘటనపై నెటిజన్లు, గాయని చిన్మయి శ్రీపాద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాహకుల వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ, అభిమానం పేరుతో సెలబ్రిటీలను ఇబ్బంది పెట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు.ప్రభాస్ హీరోగా మారుతి డైరెక్ట్ చేస్తున్న సినిమా 'ది రాజాసాబ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో రూపొందుతున్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, నిధి, రిద్ధి వంటి ముగ్గురు హీరో యిన్లు నటిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు రిలీజ్ డేట్లు మార్చుకున్న ఈ పాన్ ఇండియా మూవీని సంక్రాంతికి విడు దల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రమోషన్స్ లో భాగంగా బుధవారం నిర్వ హించిన ఈవెంట్ లో నిధికి చేదు అనుభవం ఎదురైంది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




## ఓటీటీలలో 'సంతాన ప్రాప్తిరస్తు'

ప్రేమ, కెరీర్, రిలేషన్‌షిప్స్ మాత్రమే కాదు, ఈతరం చెప్పలేనంత సున్నితమైన సమస్యలతో కూడా సంఘర్షణ పడుతోంది. అందులో ఒకటి సంతాన లేమి. బయటికి మాట్లాడాలంటే సంకోచం, లోపల వేల సందేహాలు, వందల ఒత్తిడులు. అలాంటి సున్నితమైన విషయాన్ని కథగా మలచుకున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన ఈ సినిమాకు సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించాడు. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఇప్పడి ఇదే చిత్రం తాజాగా రెండు ఓటీటీల్లో విడుదల కానుంది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో', 'జియో హాట్‌స్టార్'లో ఈ నెల 19 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది.




### 'కన్నెపిట్టరో కన్నుకొట్టరో'.. అదిరిపోయిన
## అడివి శేష్ 'డెకాయిట్' టీజర్

టాలీవుడ్ నటుడు అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్'. ఒక ప్రేమ కథ అనేది ఉపశీర్షిక. ఈ ప్రాజెక్ట్ ద్వారా షానీల్ డియో అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం కానున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్‌గ్లింప్స్‌ను విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే.. తాజాగా ఈ సినిమా నుంచి చిత్రబృందం సినిమా టీజర్‌ను విడుదల చేసింది. నాగార్జున సినిమాలోని ఐకానిక్ సాంగ్ 'కన్నెపిట్టరో కన్నుకొట్టరో' బ్యాక్‌గ్రౌండ్ పాటతో ఈ టీజర్ మొదలవ్వగా.. ఫుల్ యాక్షన్ డ్రామాగా ఈ టీజర్ సాగింది. ఇందులో అడివిశేష్, మృణాల్ ఠాకూర్ దొంగలుగా నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుంది. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుండగా.. మార్చి 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



## రేషన్‌కార్డుదారులకు ఈ-కేవైసీ తప్పనిసరి

### సన్నబియ్యం కోటా నిలిపివేత హెచ్చరిక

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ రేషన్‌కార్డు దారులందరికీ ఈ-కేవైసీ తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియను పూర్తి చేయని కార్డులకు నూతన సంవత్సరం నుంచి సన్నబియ్యం కోటా నిలిపివేయనున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల రద్దీ పెరుగుతోంది. కుటుంబ సభ్యులంతా సమీప రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ-పాస్ యంత్రంలో బయోమెట్రిక్ వేలిముద్రలు వేసి ఈ-కేవైసీ పూర్తి చేయాలి. ఐదేళ్ల లోపు పిల్లలకు మినహాయింపు ఉంది. రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ-కేవైసీని ఇంకా పెద్ద సంఖ్యలో కార్డుదారులు అప్డేట్ చేసుకోలేదని అధికారులు తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉండటంతో, గడువులోపు ఈ-కేవైసీ చేయించుకోని వారికి రేషన్ బియ్యం పంపిణీ ఉండదని హెచ్చరించింది. రేషన్ డీలర్లు దుకాణాల వద్ద అందుబాటులో ఉండాలని, సమాచారం తెలియజేసే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించింది.



### నర్సాపూర్ నియోజకవర్గంలో
## కాంగ్రెస్‌కు ఎదురుగాలి : ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అనుకూల పరిస్థితులు లేవని, స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోందని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని గోమారం గ్రామంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రజలు తమతో మాట్లాడిన తీరు చూస్తే, కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని వారు మరచిపోలేదని ఆమె అన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా సుమారు 30 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు కేవలం 50 ఓట్ల తేడాతో ఓడిపోవడం వెనుక అంతర్గత కారణాలు ఉన్నాయని, తమ పార్టీలోనే కొందరు డబుల్ నామినేషన్లు వేసి పోటీ చేయడం వల్ల నష్టం జరిగిందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు పోలీసుల అండతో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కార్యకర్తలను, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారని విమర్శించారు. ఈ అరాచకాల కారణంగానే కొన్ని కీలక సీట్లు చేజారాయని, భయాందోళన వాతావరణంలోనే కాంగ్రెస్ కొద్దిపాటి స్థానాలు సాధించిందని పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులే దొరకని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు పోలీసుల సహకారంతో దాడులు, బెదిరింపులు జరగడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా అభివర్ణించారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో వ్యవహరిస్తే తాము మౌనంగా ఉండబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ క్రమశిక్షణకు, పోరాటాలకు ప్రతీక అని, కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజల పక్షాన నిలబడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకున్న విధానాలకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పారని, ఎవరికి ఏ కష్టం వచ్చినా పార్టీ భేదం లేకుండా సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అంతకుముందు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రమణ గౌడ్ మాట్లాడుతూ శివ్వంపేట మండలంలో పార్టీకి అధిక స్థానాలు దక్కేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, సీనియర్ నాయకులు సింగయపల్లి గోపి సహా కార్యకర్తలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా సర్పంచులు,




### టీవీ నుంచి మొబైల్‌కు.. ఇకపై యూట్యూబ్‌లో
## ఆస్కార్ వేడుకలు

సినిమా ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ వేడుకలకు సంబంధించి ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకోబోతోంది. ఇప్పటివరకు టెలివిజన్ ఛానెళ్లలో ప్రసారమవుతున్న ఈ వేడుకలు 2029 నుంచి నేరుగా యూట్యూబ్ వేదికగా ప్రపంచవ్యాప్తంగా లైవ్ స్ట్రీమింగ్ కానున్నాయి. దీనికి సంబంధించి అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్, గూగుల్ సంస్థకు చెందిన యూట్యూబ్‌తో మల్టీ-ఇయర్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం 2029 నుంచి 2033 వరకు ఐదేళ్ల పాటు అమల్లో ఉండబోతుంది. 1976 నుంచి దాదాపు 50 ఏళ్లుగా ఆస్కార్ వేడుకల ప్రసార హక్కులు అమెరికాకు చెందిన ABC (Disney) నెట్‌వర్క్ వద్ద ఉన్నాయి. 2028లో జరగబోయే 100వ ఆస్కార్ వేడుకతో ఈ టీవీ ఒప్పందం ముగియనుంది. దీంతో ఆస్కార్ వేడుకల స్ట్రీమింగ్ హక్కులను యూట్యూబ్ దక్కించుకున్నట్లు గూగుల్ ప్రకటించింది. ఆస్కార్ వేడుకలు యూట్యూబ్‌లోకి రావడం వలన ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా ప్రేమికులు ఉచితంగా చూసే అవకాశం ఉంటుంది. అయితే కేవలం ప్రధాన వేడుక మాత్రమే కాకుండా, రెడ్ కార్పెట్ ఈవెంట్, తెర వెనుక విశేషాలు, నామినేషన్ల ప్రకటన వంటివన్నీ ఆస్కార్ అధికారిక యూట్యూబ్ ఛానెల్‌లో అందుబాటులో ఉంచబోతుంది యూట్యూబ్. గ్లోబల్ ఆడియన్స్ కోసం వివిధ భాషల్లో ఆడియో ట్రాక్‌లు, సబ్‌టైటిల్స్ అందించాలని యూట్యూబ్ ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం 98వ ఆస్కార్ వేడుకలు 2026 మార్చి 15న లాస్ ఏంజిల్స్‌లో జరగనున్నాయి.

### రూ.11 వేలు లంచం డిమాండ్ చేస్తూ..
## ఏసీబీ వలలో ఓయూ డీఈ

ఈమధ్యకాలంలో ఏసీబీ అధికారులు దాడుల గురించి నిత్యం వార్తలు వెలుగులోకి వస్తున్నాయి. వందల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడి.. భారీగా అక్రమాస్తులు కూడబెట్టిన అధికారుల గురించి నిత్యం వింటూనే ఉన్నాం. ఈ క్రమంలో మరో అవినీతి అధికారి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సదరు అధికారి అత్యంత ప్రతిష్టాత్మకమైన ఓయూలో పనిచేస్తున్నారు. పైగా మరో రెండు నెలల్లో రిటైర్ కాబోతున్నారు. అలాంటి వ్యక్తి రూ.11 వేలు లంచం తీసుకుంటూ అధికారుల చేతికి చిక్కారు. మరో 2 నెలల్లో రిటైర్ కాబోతున్న ఓయూ డీఈ లంచం తీసుకుంటూ అవినీతి అధికారులకు చిక్కారు. కాంట్రాక్టర్ వద్ద నుంచి రూ.11 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారుల చేతికి చిక్కారు ఓయూలో డిప్యూటీ ఇంజనీర్‌గా పని చేస్తున్న రాకొండ శ్రీనివాసులు. ఈక్రమంలో మానేరు బాలుర హాస్టల్ పునరుద్ధరణ పనులకు సంబంధించి.. కాంట్రాక్టర్‌కు రూ.14 లక్షల బిల్లు రావాల్సి ఉంది. దీనిలో సగం అంటే రూ.7 లక్షల బిల్లు విడుదల చేయాల్సి ఉండగా.. డీఈగా ఉన్న శ్రీనివాసులు ఇందుకు గాను 11 వేల రూపాయలు లంచం డిమాండ్ చేశారు. దీంతో సదరు కాంట్రాక్టర్ ముందుగా శ్రీనివాసులుకు రూ.5 వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. మరో 6 వేల రూపాయలు ఇవ్వాల్సి ఉంది. ఆ మొత్తం కోసం శ్రీనివాసులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేయసాగాడు. దీంతో కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. వారి సూచనల ప్రకారం సదరు కాంట్రాక్టర్.. మంగళవారం నాడు డీఈ శ్రీనివాసులుకు రూ.6 వేలు ఇచ్చాడు. ఈ డబ్బులు తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు డీఈని అదుపులోకి తీసుకున్నారు. మరో రెండు నెలల్లో రిటైర్ కావాల్సిన వ్యక్తి.. ఇలా అవినీతి అధికారుల వలలో చిక్కుకోవడం గమనార్హం. కొన్ని రోజుల క్రితం హనుమకొండ అడిషనల్ కలెక్టర్ భారీగా లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సంగతి తెలిసిందే. అదనపు కలక్టర్ వెంకట్ రెడ్డి రూ.60 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారుల చేతికి చిక్కారు. అలానే ల్యాండ్ రికార్డ్స్ ఏడీగా పని చేస్తున్న ఓ ఉద్యోగి ఏకంగా రూ.100 కోట్ల రూపాయలకు పైగా అక్రమాస్తులు కూడబెట్టిన సంగతి తెలిసిందే. ఆయన మూడు రాష్ట్రాల్లో భారీగా వ్యవసాయ భూమి, ప్లాట్లు కొనుగోలు చేశారు.



## కొత్త లుక్‌లో దర్శనమిచ్చిన స్మృతి మంధాన

పలాశ్ ముచ్చల్‌తో పెళ్లి రద్దు చేసుకున్న తర్వాత టీమిండియా వుమెన్స్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన కొత్తలుక్‌లో దర్శనమిచ్చారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న స్మృతి వైట్ కలర్ డిజైనర్ డ్రెస్‌లో మెరిసిపోయారు. సింపుల్ మేకప్, స్మైల్‌తో నెటిజన్లను, అభిమానులను ఆకట్టుకున్నారు. ఈ ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇవి చూసిన నెటిజన్లు, అభిమానులు స్మృతి ఫొటోలకు లైక్స్, కామెంట్స్ చేస్తున్నారు. వన్డే వరల్డ్‌కప్‌లో అదరగొట్టిన మంధాన.. ఆ తర్వాత పెళ్లి వార్తతో దేశం దృష్టిని ఆకర్షించింది. పలాశ్ ముచ్చల్‌తో తన అనుబంధాన్ని మరో మెట్టు ఎక్కించాలనుకున్న ఆమె అనుకోకుండా యూటర్న్ తీసుకుంది. ప్రేమించిన వ్యక్తితో పెళ్లి రద్దు నిర్ణయంతో అందర్నీ షాక్‌కు గురి చేసింది. బ్రేకప్ తర్వాత కోలుకున్న స్మృతి.. క్రికెట్ తన ఫస్ట్ లవ్ అని, క్రికెట్ ఆడడం తప్ప తనకు ఇంకేది ఇష్టం లేదని వెల్లడించింది. మరోవైపు డిసెంబర్ 21 నుంచి 30 వరకు స్వదేశంలో శ్రీలంకతో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం ప్రాక్టీస్ మొదలు పెట్టింది స్మృతి.



## మృణాల్ ఠాకూర్ హాట్ లుక్

ఆ బ్యూటీ మృణాల్ ఠాకూర్. సీతారామం సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. మొదటి సినిమాతోనే ఊహించని మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఇందులో సీతామహాలక్ష్మి పాత్రలో అద్భుతమైన నటనతో జనాలను కట్టిపడేసింది.ఆ తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ చిత్రాల్లో నటించి మెప్పించింది. ఇప్పుడు ఈ అమ్మడు బాలీవుడ్ సినిమాలపై ఫోకస్ పెట్టింది. అలాగే తెలుగులోనూ ఒక సినిమా చేస్తుంది. అదే డెకాయిట్. ఇందులో అడివి శేష్ హీరోగా నటిస్తున్నారు.ఈ సినిమాకు ఆమె రూ.2.5 కోట్లు పారితోషికం తీసుకుంటుందని సమాచారం. అలాగే ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ డిమాండ్ ఉన్న హీరోయిన్లలో ఆమె ఒకరు. బుల్లితెర నుంచి సిల్వర్ స్క్రీన్ వరకు ఆమె ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తి.సోషల్ మీడియాలో ఈ బ్యూటీకి విపరీతమైన క్రేజ్ ఉంది. అటు చీరకట్టులో.. ఇటు గ్లామర్ లుక్కులో మెస్మరైజ్ చేస్తుంది మృణాల్.